ప్రజాశక్తి

ఆదివారం 16 ఏప్రిల్ 2023   8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నీటి కోసం రోడ్డెక్కిన రైతులు

నకరికల్లులో రైతు సంఘం నాయకుల అరెస్టు - అరెస్టులను ఖండిస్తూ నిరసన - సత్తెనపల్లిలో ఉద్రిక్తత

ఎట్టకేలకు అంగీకరించిన మంత్రి అంబటి రాంబాబు - సాగర్ జలాశయం నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి-నకరికల్లు, సత్తెనపల్లి

సాగర్ కుడికాలువకు నీటిని విడుదల చేయాలని కౌలు రైతు సంఘం, రైతు సంఘం, ఆధ్వర్యంలో శనివారం పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డురోడ్డు ధర్నా చేస్తున్న రైతు నాయకులు, రైతులను పోలీసులు అరెస్టు చేశారు. చేజర్ల, నకరికల్లు అడ్డురోడ్డు వద్ద వేర్వేరుగా పోలీసులు అరెస్టులు చేసి రాజుపాలెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. రైతులు ధర్నాకు వస్తారన్న సమాచారంతో పోలీసులు ముందస్తు అరెస్టులకు శ్రీకారం చుట్టారు. ఆర్‌టిసి బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలను తనిఖీ చేసి రైతులను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. అప్పటికే నకిరికల్లు అడ్డరోడ్డు వద్దకు చేరుకున్న రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు ఆటోలో కూర్చొని రైతుల కోసం ఎదురుచూస్తున్నారు. రైతులు సమాయత్తం అవుతుండగా పోలీసులు చేరుకొని రైతులను చేదరగొట్టి ,నాయకులను అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. పోలీసుల నాయకుల మధ్య తోపులాట చోటు చేసుకోవడంతో బలవంతంగా అదుపులో తీసుకొని బస్ ఎక్కించారు. రైతులు నష్టపోతున్న ప్రభుత్వ వెంటనే స్పందించి నీటిని విడుదల చేయాలని, పల్నాడు ప్రాంతంలో దాదాపు లక్ష ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నీరు నీరు అందక పంటలు ఎండిపోతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని తెలిపారు. ప్రభుత్వ నిరంకుశత్వం, పోలీసుల దౌర్జన్యం నశించాలని

2లో



గుంటూరు విజయకుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు



వై రాధాకృష్ణను అరెస్టు చేస్తున్న పోలీసులు



సత్తెనపల్లి నిరసనలో నీటి విడుదలకు హామీ ఇస్తున్న మంత్రి అంబటి



నకరికల్లులో ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

వారాబందీ అమలు చేయండి : రైతు సంఘం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సాగర్ ఆయకట్టులో చివరి భూములకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి కోరారు. వారం రోజుల పాటు రైతుల ఆందోళనకు స్పందించిన ప్రభుత్వం నీటి విడుదల చేయడంపై జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పంటలకు నీటి విడుదల చేసే విషయంలో 'వారాబందీ' అమలు చేయాలని, చివరి భూములకు నీరందించేందుకు కాల్వలపై వివిధ శాఖల అధికారులతో కమిటీలు వేయాలన్నారు. చివరి భూములకు నీరు అందించేందుకు కాల్వలకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాల్వలపై నిఘా విధించాలని కోరారు. పంటలకు కోసం విడుదల చేసిన నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు ప్రేమ్‌కుమార్ తదితరులు

4 ఏళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదు

10 నుండి 15 వేల పోస్టులతో డీఎస్సీ ఇవ్వండి : ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-నరసరావుపేట


వైసిపి అధికారం చేపట్టిన నాలుగేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వకుండా అభ్యర్థులకు ద్రోహం చేసిందని ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ రావు విమర్శించారు. స్థానిక స్టేషన్ రోడ్డులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల శాసనమండలిలో కూడా డీఎస్సీ ఎప్పుడు ఇస్తారని చర్చ జరిగినప్పుడు మంత్రి బొత్స సత్యనారాయణ రకరకాల పోస్టులు భర్తీ చేశామని చెప్పారని అన్నారు. 2019 డిఎస్సీ ఎప్పుడు ఇస్తారని అడిగితే 712 పోస్టులు మాత్రమే ఉన్నాయని చెప్పారని దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ఇచ్చేందుకు ఎట్టకేలకు అంగీకరించిందని జులై, ఆగస్టు నెలలలో డిఎస్సీ విడుదల చేసే అవకాశం ఉందన్నారు. కనీసం 10 నుంచి 15 వేల పోస్టులతో డీఎస్సీ ఇవ్వాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా ఒత్తిడి చేస్తున్నామన్నారు. 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల కోసం సుదీర్ఘమైన పోరాటాలు ఉద్యమాలు చేశామని, 2007 నుండి అనేకసార్లు అరెస్టులకు గురైన విషయాన్ని ప్రస్తావించారు. 1998 అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం హర్షణీయమన్నారు. సుమారు 6800 మందికి సర్టిఫికేట్ వెరిఫిషన్ జరిగిందని అందరూ కూడా ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారని అన్నారు. 6800 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశాం కానీ, 4025 మందికి మాత్రమే అవకాశం వచ్చిందని అన్నారు. 2800 మందికి పైగా అభ్యర్థులు నిరాశ నిస్పహలతో ఉన్నారని, అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని యుటిఎఫ్ తరఫున పిడిఎఫ్ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. 4000 పోస్టులు కూడా మెరిట్ ఆధారంగా ఇచ్చారని, రాజ్యాంగ సూత్రాల ప్రకారం ఇచ్చారని ఇది సామాజిక న్యాయ సూత్రానికి పూర్తిగా విరుద్ధమని, వెరిఫికేషన్ పూర్తయిన ప్రతి అభ్యర్థికి ఉద్యోగం ఇచ్చినట్లయితే ఇటువంటి సమస్య ఉండేదికాదన్నారు. దీనికి సంబంధించి ఈ వారంలో కార్యచరణ కూడా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. బదిలీలు కోరుకుంటున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం విడుదల చేసిన అసంబద్ధ జీవో ఆటంకాలు ఉన్నాయని, కోర్టు కేసులు తొలగించి విడుదల చేసిన జీవోలను రద్దుచేసి, బదిలీలకు సంబంధించి అవసరమైతే ఒక చట్టాన్ని రూపొందించాలన్నారు. పాఠశాలను ప్రారంభించేలోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించి అనేక సమస్యల మీద పిడిఎఫ్ ఆధ్వర్యంలో పిడిఎఫ్ అభ్యర్థులు ఎప్పటికీ పోరాటం చేస్తారన్నారు. అనంతరం పదవ తరగతి పరీక్షలు సక్రమంగా నిర్వహించినందుకు గాను

2లో

సాగర్ కుడికాలువకు నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురి సౌత్

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువ ద్వారా శనివారం రాత్రి 7 గంటలకు సాగునీటి అవసరాల నిమిత్తం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సాగర్ కుడికాలువ గేటు సబ్‌డివిజన్ డిఇ మురళీధర్ మాట్లాడుతూ ప్రాజెక్టు 9వ గేటు ద్వారా 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని గంటకు 1,000 క్యూసెక్కుల చొప్పున పెంచుతూ రాత్రి 10 గంటలకు 4.500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఆంధ్రా సీఈ మురళినాధ్‌రెడ్డి సాగునీటికి 6టీఎంసీల నీరు విడుదల చేయాలని కృష్ణానది యాజమాన్య బోర్డును కోరటంతో బోర్డు అంగీకారం తెలిపినట్లు చెప్పారు. ఆదివారం ఉదయానికి 9వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగర్ ప్రాజెక్టు గేటు సెక్షన్ జెఇ బాబుమియా, తెలంగాణా డీఈ పరమేష్, ఆపరేటర్ సజన్ తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి విడుదలవుతున్న నీరు



జెసికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులు కేటాయించాలి

2లో

మొక్కల పెంపకం, పంపిణీ నిలిపివేత

సామాజిక అటవీశాఖ ఆఫీసు ఎత్తివేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు అయిన నేపథ్యంలో గుంటూరు జిల్లాలో పట్టణ ప్రాంతాలకు అధికంగా ఉండటం, అటవీ విస్తీర్ణం లేకపోవడం వల్ల సామాజిక అటవీ శాఖ జిల్లా కార్యాలయాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సామాజిక అటవీ శాఖ పరిధిలో జిల్లాలో మొక్కల పెంపకం నిలిచిపోయింది. మొక్కల పెంపకం, పంపిణీ, వాటి సంరక్షణ బాధ్యతలను చూడాల్సిన ఈశాఖను పూర్తిగా తొలగించడం వల్ల ఈ శాఖ సిబ్బందిని అటవీశాఖలోనే ఇతర విభాగాలకు సర్దుబాటు చేశారు. అటవీశాఖలోని రిజర్వు ఫారెస్టు, వైల్డ్ లైఫ్, ఫ్లైయింగ్ స్వాడ్ తదితర విభాగాలను కొనసాగిస్తూ సామాజిక అటవీ విభాగాన్ని మాత్రం ఎత్తి వేయడంతో జిల్లాలో మొక్కల పెంపకం, పంపిణీ ప్రశ్నార్ధకంగా మారింది.గత కొంత కాలంగా ఈ ప్రక్రియనిలిచిపోయింది. జిల్లా పరిధిలో గుంటూరు, మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్లు, తెనాలి, పొన్నూరు మునిసిపాలిటీలు, తాడికొండ, పత్తిపాడు నియోజకవర్గాలు ఉన్నాయి. మంగళగిరిలో ఉన్న కొండ ప్రాంతంలోనే పరిమితంగా మొక్కలు పెంచే అవకాశం ఉంది. పోడు సాగు ద్వారా మంగళగిరి కొండపై విత్తనాలు చల్లి మొక్కలు పెంచడానికి అవకాశంఉందని,మిగతా 17 మండలాల్లో ఎక్కడా అటవీ ప్రాంతం లేదని అధికారులు తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతంలోనే ఎక్కువ

2లో





నియామక పత్రాలను చూపుతున్న లక్ష్మీనారాయణ

తెనాలికి నలుగురు ఉపాధ్యాయుల నియామకం

ప్రజాశక్తి-తెనాలి

డిఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ప్రభుత్వం పోస్టింగులు ఇచ్చిన నేపథ్యంలో తెనాలి మండలానికి నలుగురు ఉపాధ్యాయులు నియామకం పొందినట్లు మండల విద్యాధికారి మేకల లక్ష్మినారాయణ వెల్లడించారు. ఎంపికైన ఉపా ధ్యాయులు మర్యాద పూర్వకంగా తనను కలిసినట్లు చెప్పారు. వారిలో సిహెచ్ వెంకటసుబ్రహ్మణ్యం, కంచర్లపాలెం ఎల్ఈ స్కూల్‌కు, కె.రత్నబాబు గుడివాడ ఎంపిపిఎస్ ఎల్ఈ స్కూల్‌కు, కె.కృష్ణసాయిప్రసాద్ అంగలకుదురు సజ్జనపేట ఎంపిపిఎస్ స్కూల్‌కు, ఎ.శ్రీమన్నారాయణ చావవారిపాలెం ఎంపిపిఎస్ స్కూల్‌కు కేటాయించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిపై 24 ఏళ్ళకాలం వేచిఉన్న ఉపా ధ్యాయులను ఎంఈఓ అభినందించారు.

4 ఏళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా డీఈవో శామ్యూల్ ను కలిసి అభినందించారు. పదవ తరగతి పరీక్ష పత్రాల స్పాట్ వాల్యూషన్ కూడా నరసరావుపేటలో జరగనున్న నేపథ్యంలో సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. యు.టి.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ సారథి మాట్లాడుతూ జిల్లాలో పరీక్షలు నిర్వహణ ప్రశాంత వాతావరణంలో జరిగిందని, ఇందులో ఉపాధ్యాయుల కృషి వారి పాత్ర ఎంతో ఉందన్నారు. జరగనున్న స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించి కూడా 60 ఎళ్లు దాటిన ఉపాధ్యాయులకు, దీర్ఘకాలికంగా వివిధ వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులను, విధులకు రాలేని ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టకుండా వదిలివేయాలని డిఇఒను కోరగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి ప్రేమ్‌కుమార్, జి విజయసారధి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పది పరీక్షలు విజయవంతంగానిర్వహించి నందుకు డిఒఒ శ్యామ్యూల్‌కు ఎమ్మెల్సీ లక్ష్మణరావు అభినందనలు తెలిపారు. స్పాట్ వ్యాల్యుషన్ కేంద్రంలో తగిన వసతులు కల్పించాలని కోరారు.

మొక్కల పెంపకం, పంపిణీ నిలిపివేత

(మొదటి పేజీ తరువాయి)

అటవీప్రాంతం ఉంది. బాపట్ల జిల్లాలో సముద్రతీరప్రాంతంతో పాటు కొంత అటవీ ప్రాంతం ఉంది. ఇందువల్ల గుంటూరు జిల్లా పరిధిలో అటవీ విస్తీర్ణం 5 శాతం మాత్రమే ఉండటం వల్ల ఈప్రాంతంలో సామాజిక అటవీ డివిజన్ అనవసరమని ప్రభుత్వం భావించింది. గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీలు నిర్వహించి మొక్కలను వివిధ ప్రభుత్వ శాఖలకు, విద్యా సంస్థలకు, ఇతర ప్రైవేటు సంస్థలకు, ప్రజలకు పంపిణీ చేసి వాటిని నాటించే వారు. నాటిన మొక్కల్లో కనీసం 20 శాతం బతికి నిలదొక్కుకున్నా ఎన్నో వేల వృక్షాలు ఏర్పడేవి. గత రెండేళ్లుగా నర్సరీల నిర్వహణ, మొక్కల కొనుగోలు, నిర్వహణ, సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. గత రెండేళు ్లగా నామమాత్రంగానే మొక్కల పెంపకం జరిగింది. దీంతో సామాజిక అటవీశాఖకు పెద్దగా పనులు లేక ఉద్యోగులు,అధికారులు కాలం వెళ్లబుచ్చుతూ వచ్చారు. కొత్త జిల్లాల ఏర్పాటు చేసిన నేపథ్యంలో అటవీ విస్తీర్ణం లేని జిల్లాల్లో ఈ విభాగాలను ఎత్తివేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా జిల్లా కార్యాలయం ఎత్తివేశారు. దీంతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు మొక్కలు ఎవరు సరఫరాచేస్తారన్నదీ ప్రశ్నార్థకంగా మారింది.

గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-గుంటూరు



ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న రైతులు , రైతు సంఘాల నాయకులు

గుంటూరు ఛానల్ విస్తరణకు సంబంధించి భూసేకరణకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్యవక్తగా పాల్గొని మద్దతు పలికారు. ధర్నాలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పర్చూరు వరకూ పొడిగించాలనే డిమాండ్ సుదీర్ఘకాలంగా కొనసాగుతూ ఉందని, వివిధ రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆ ప్రాంత ప్రజలు పోరాడుతున్నారు అని తెలిపారు. ఛానల్ పొడింపు వల్ల పెదనందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు, పర్చూరు మండలాల్లో 50వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాలకు త్రాగునీరు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఇంత కీలకమైన ఈ ప్రాజెక్టు పట్ల ప్రభుత్వాల ఉదాసీనత తగదన్నారు. రైతు సంఘాలు చేసే ఆందోళనకు పిడిఎఫ్ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగింపు ప్రక్రియ ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం నుంచి రైతులు గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం పోరాడుతున్నారని తెలిపారు. భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం, రాష్ట్ర బడ్జెట్‌లో అందుకు అవసరమైన నిధులు కేటాయించలేదన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామన్న సాకుతో రైతుల ప్రయోజనాలను పట్టించుకోవట్లేదని విమర్శించారు. వెంటనే భూసేకరణకు నిధులు కేటాయించాలని, లేని ఎడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. గుంటూరు జిల్లా తెలుగు రైతు నాయకులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో గుంటూరు ఛానల్ కొరకు పొడిగింపునకు నిధులు కేటాయించి, పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేసిందిన తెలిపారు. విస్తరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు రైతుసంఘాలు చేసే పోరాటానికి తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు లావు అంకమ్మ చౌదరి మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా రైతులందరూ ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నాలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, నల్లమడ రైతు సంఘం నాయకులు నరిశెట్టి ఆచారి, గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు, జిడిసిసి మాజీ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ , రైతు సంఘాల ఐక్యవేదిక నాయకులు కుర్రా హరిబాబు, ఏపీ రైతు సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, రైతు నాయకులు కే శ్రీధర్, లావు వెంకట నాగేశ్వరరావు కొల్లి రంగారెడ్డి, సిఐటియు నాయకులు కాకుమాను నాగేశ్వరరావు మాట్లాడి మద్దతు తెలియజేశారు. అనంతరం కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

టెన్త్ పరీక్షలకు 99.25 శాతం హాజరు

ప్రజాశక్తి-గుంటూరు : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు శనివారం 99.25 శాతం విద్యార్థులు హాజరయ్యారు. 26,539 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 26,342 మంది రాశారు. 197 మంది గైర్హాజరయ్యారు. కాగా ఈనెల 3వ తేదీ నుండి పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించి శనివారంతో ప్రధాన పరీక్షలు ముగి శాయి, 17, 18 తేదీల్లో సంస్కృతం, ఒకేషనల్ పరీక్షలు ఉంటాయి. ఈనెల 19వ తేదీ నుండి 26వ తేదీ వరకూ స్థానిక నగరంపాలెంలోని స్టాల్ గరల్స్ బాలికల హై స్కూల్లో జవాబు పత్రాల మూల్యాంకనం చేయటానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-గుంటూరు



ప్రభుత్వ ఉద్యోగుల కొరకు శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపును శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను, పరికరాలను కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారితో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో హెల్త్‌చెకప్ చేయాలనే ఉద్దేశంతో మెగా హెల్త్ క్యాంపును ఏర్పాటు చేశామన్నారు. కంటి పరీక్షలు, దంత సమస్యలు, ఈఎన్‌టి, జనరల్ మెడిసిన్, గైనిక్ మెడిసిన్ కన్సల్టేషన్‌లను ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును జేసీ రాజకుమారి, డిఆర్ఒ చంద్రశేఖర్‌రావు, జిజిహెచ్ సూపరింటెండెంట్, మెడికల్ ఆఫీసర్ డి.ఎం.అండ్ హెచ్.ఓ, డి.సి.హెచ్.ఎస్, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ పర్యవేక్షించారు. జి.జి.హెచ్, మణిపాల్, లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కాటూరి మెడికల్ కళాశాల, ఆదిత్య వైద్యశాల, శ్రీ హాస్పిటల్, డాక్టర్ ఆగర్వాల్ కంటి వైద్యశాల, ప్రత్యూష డెంటల్, స్మైల్ డెంటల్, కాశ్వీ డెంటల్ వైద్యశాలలు తమ సిబ్బందితో, మేషనరీతో క్యాంపులో ఉద్యోగులకు హెల్త్ చెకప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ ప్రభాకర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.



నకరికల్లులో ఆందోళనకారులతో వాగ్వాదం చేస్తున్న పోలీసులు

నీటి కోసం రోడ్డెక్కిన రైతులు

(మొదటి పేజీ తరువాయి)

నినాదాలు చేశారు. అనంతరం వారిని రాజుపాలెం పోలీస్ స్టేషన్ కు తరలించారు. ధర్నాలో కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై రాధాకష్ణ, పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు కామినేని రామారావు, పల్నాడు జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఏపూరి గోపాలరావు, పల్నాడు జిల్లా సిపిఎం కార్యదర్శి గుంటూరు విజయకుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ సిలార్, అనుముల లక్ష్మీ శ్వర రెడ్డి, జి వెంకటేశ్వర్లు, ఈవూరి లక్ష్మారెడ్డి తదితరులను అదుపులోకి తీసుకున్నారు. కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు గాడిద మల్ల పిచ్చారావు, పీడియం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్వలి ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

రాజుపాలెం పోలీస్ స్టేషన్ వద్ద అరెస్టయిన రైతు సంఘం నాయకులను పరామర్శించేందుకు వచ్చిన సీనియర్ రైతు సంఘం నాయకులు గద్దె చలమయ్య మొదట పోలీసులు స్టేషన్‌లోకి అనుమతించకపోవడంతో నిరసనగా చలమయ్య పోలీసు స్టేషన్ వరండాలో పడుకోని నిరసన తెలిపి మంత్రి అంబటి రాంబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. తరువాత చలమయ్యను స్టేషన్ లోపలికి అనుమతించారు. సాయంత్రం వరకు రాజుపాలెం పోలీస్‌స్టేషన్ లో కూర్చోబెట్టి సొంత పూచి కత్తుపై విడుదల చేసినట్టు నాయకులు తెలిపారు.

సత్తెనపల్లిలో ఉద్రిక్తత - మంత్రి హామీతో దీక్ష విరమణ

నకరిల్లు అడ్డరోడ్డు వద్ద శాంతియుతంగా ఆందోళన చేపట్టిన రైతు, కౌలురైతు, సిపిఎం నాయకులను అరెస్టు చేసి రాజుపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని నిరసిస్తూ సత్తెనపల్లి సిపిఎం కార్యాలయం నుండి నిరసనకు బయలు దేరిన ప్రజాసంఘాల నాయకులను పట్టణ పోలీసులు మోహరించి అడ్డుకున్నారు. సిపిఎం కార్యాలయం నుండి తాలూకా సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేసి అంబేద్కర్ విగ్రహం ధర్నా చేపట్టారు. రైతుల ఆందోళనలను తెలుసుకున్న రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆందోళనకారుల వద్దకు వచ్చి ఈ రాత్రికి సాగునీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ విడుదల చేయడానికి అవసరమైన నీరు 527 అడుగుల వరకు ఉన్నదని అన్నారు. అయితే దీనిపై కష్ణ నది మేనేజ్మెంట్ బోర్డు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అన్నారు. సాగర్ డ్యాం మొత్తం నీటిలో ఆంధ్రప్రదేశ్ కు 66శాతం, తెలంగాణ రాష్ట్రానికి 34శాతం వాటాలు ఉన్నాయని అన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం 50శాతం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో దీనిపై చర్చలు జరుగుతున్నాయని ఆ చర్చలపై ఒక అంగీకారానికి వచ్చారని అన్నారు.ఈ నేపథ్యంలో కృష్ణానది యాజమాన్య బోర్డు నీటిని విడుదల చేసేందుకు అంగీకారం తెలిపిందని శనివారంరాత్రికి సాగర్ కుడి కాలువకు నీరు చేస్తామని హామీ ఇచ్చారు. దీనికోసం గత కొన్ని రోజులుగా నిర్విరామంగా కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి శివనాగరిణి, నాయకులు ధరణికోట విమల, గద్దె ఉమశ్రీ, అరెస్టు చేసిన నాయకులను కూడా విడుదల చేశారు.

కొండవీడులో నూతన అడ్వెంచర్స్‌కు శ్రీకారం

ప్రజాశక్తి-నరసరావుపేట



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న అటవీ అధికారులు

ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొండవీడును "కొండవీడు అడ్వెంచర్స్" అనే పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శ్రీకారం చుట్టారు. పల్నాడు జిల్లా, యడ్లపాడు మండల పరిధిలోని కొండవీడు కోట పర్యాటక ప్రాంతం మధ్యలో అటవీశాఖ (ఫారెస్ట్ డిపార్ట్ మెంట్)-అవుట్ రైవల్ అడ్వెంచర్స్ టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో (నైట్ క్యాంపెయిన్) అనే వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నైట్ క్యాంపెయిన్ చేసేందుకు వీలుగా ఆ ప్రాంతంలో సుమారు 10 వరకు టెంట్‌లను ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు పర్యాటక ప్రాంతంలో సేద తీరుతూ ఆహ్లాదంగా గడిపే విధంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కొండవీడు కోట ప్రాంతం పర్యటకంగా తిలకించేందుకు రాత్రి బస చేయడం, అక్కడే విందు, వినోదాలు, ఆటలు, పాటలు, నృత్యాలతో కూడిన కార్యక్రమాలు నిర్వహణ, మరుసటి రోజు ఉదయం ట్రక్కింగ్, యోగా, రాక్ క్లైమ్బింగ్ (కొండలు ఎక్కడం) వంటి పలు విన్యాసాలను ఆ ప్రాంతంలో చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కొండవీడు కోట పర్యటనకు వెళ్ళారు. అక్కడే రాత్రి బస చేసి స్వయంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కొండవీడు పర్యాటక ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు వచ్చే పర్యాటకుల కోసం ప్రత్యేక ప్యాకేజి ఏర్లోపాటు చేశామన్నారు. చిన్నారులు అయితే ఒక్కరికి (5 - 14 ఏళ్ల లోపు) వారికి రూ.1,000/ లు, పెద్దలకు రూ.2,000 వేలు టిక్కెట్ ధరను నిర్ణయించామన్నారు. ఈ ప్యాకేజి లోనే రాత్రి విందులో వెజ్/నాన్ వెజ్ వంటి రుచికరమైన వంటకాలతో ఆహార పదార్థాలను అందించనున్నారన్నారు. ఉదయం రుచికరమైన అల్పాహారం ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు అటవీ శాఖ అధికారి వెంకట రమణ సెల్ : 91824 50278, కొండవీడుఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సెల్ : 9494 674 744లలో సంప్రదించ వచ్చునని పేర్కొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు , అధ్యాపకులు

జాతీయ మూట్ కోర్టు పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి రాజధానిలోని విఐటి విశ్వ విద్యాలయంలో స్కూల్ ఆఫ్ లా (విఎస్ఎల్), కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) సంయుక్త ఆధ్వర్యంలో మొదటి జాతీయ మూట్ కోర్ట్ పోటీలు శనివారం ప్రారంభ మయ్యాయి. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. మొదటి రోజు శనివారం జాతీయ మూట్ కోర్టు పోటీలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ముఖ్య న్యాయమూర్తి రావు రఘునందన్ రావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కె లక్ష్మణ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా రావు రఘునందన్ రావు మాట్లాడుతూ, న్యాయవాద కళను మూట్ కోర్టులు నేర్పుతాయని అన్నారు.ఖచ్చితత్వం న్యాయవాది యొక్క నిజమైన హాల్ మార్క్ అని అన్నారు.కే లక్ష్మణ్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ఒక ఉన్నతమైన వృత్తి అని, న్యాయం చేయడానికి అంకితభావంతో పని చేయాలని అన్నారు. చిత్తశుద్ధి,కృషితో ఉన్నత స్థానాలకు చేరవచ్చున్నారు.చట్టంలోని ప్రాథమిక సూత్రాలను అర్థం చేసుకోవాలని,అప్పుడే న్యాయవాద వృత్తిలో రాణించవచ్చునని అన్నారు. విఐటీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాఎస్వి కోటా రెడ్డి మాట్లాడుతూ, మూట్ కోర్ట్ పోటీ ప్రాముఖ్యతను తెలియజేశారు.న్యాయవాద విద్యార్థుల నైపుణ్యాలను చక్కదిద్దడానికి,కేసు విచారణ కోసం కోర్టుకు హాజరు కావడానికి ముందు వారి విశ్వాసాన్ని మెరుగుపచుకోవటానికి ఇటువంటి మూట్ కోర్ట్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. డాక్టర్ బెనర్జీ చక్కా (డీన్, విఐటీ-స్కూల్ ఆఫ్ లా) మాట్లాడుతూ మూట్ కోర్ట్ అనేది చట్టపరమైన ప్రక్రియలు, ట్రయల్స్ జరిగే నిజమైన కోర్టు గదికి సూక్ష్మ రూపమని అన్నారు.దీనిని మాక్ కోర్ట్ అని కూడా పిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో విఐటీ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.జగదీష్ చంద్ర, స్నేహ గౌడ్ (ఫ్యాకల్టీ కన్వీనర్,మొదటి జాతీయ మూట్ కోర్ట్ పోటీలు)న్యాయ విద్యా ర్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నుపోటు రాజకీయాలు తగవు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం వల్లేనే డిసిసిబి మాజీ డైరక్టర్ వర ప్రసాద్(బుజ్జి)ను బహిష్కరించినట్టు పెదకూరపాడు నియోజకవర్గం వైసిపి నాయకులు తెలిపారు. గుంటూరులోని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయంలో వారు శనివారం మీడియాతో మాట్లాడారు. పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు వ్యతిరేకంగా పార్టీ కార్యకలాపాలకు పాల్పడినందువల్లే ఇటీవల కంచేటి సాయిని పార్టీ నుంచి బహిష్కరించారని రెండు రోజుల క్రితం ఇదే కోవలో వర ప్రసాద్‌ను కూడా పార్టీ అధిష్టానం బహిష్కరించిందన్నారు. బహిష్కరించిన తరువాత వరప్రసాద్(బుజ్జి) ఎమ్మెల్యే శంకరరావుపై చేసిన ఆరోపణలను క్రోసూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ ఈదా సాంబిరెడ్డి, పెదకూరపాడు ఎంపిపి బెల్లంకొండ మీరయ్య, పెదకూరపాడు మండల పార్టీ అధ్యక్షులు షేక్ షరీఫ్, నాయకుడు యోహాను ఖండించారు. 2019 ఎన్నికలకు ముందు పార్టీలో చేరి.. పదవులు దక్కించుకొని.. ఇప్పుడు ఎన్నికలకు ముందు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. వెన్నుపోటు రాజకీయాలు తగవన్నారు. కేవలం కొంతమంది ప్రోద్భలంతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వారి కుటుంబసభ్యులపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యులు ఎక్కడా నియోజకవర్గ రాజకీయాల్లో జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు. ఇటీవల టిడిపిలో చేరిన కన్నా లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లిన వర ప్రసాద్ తన చర్యలను ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ప్రజాశక్తి-ఈపూరు

ఒంటిపై కాలిన గాయాలతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బొగ్గవరపు కోటేశ్వరమ్మ(35) శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ విప్పర్ల వెంకటరావు తెలిపారు. ఈ నెల 9వ తేదీన మండలంలోని కూచినపల్లి గ్రామంలో పుట్టింట్లో ఉన్న భార్య కోటేశ్వరమ్మ పై భర్త నాగరాజు కాపురానికి రావడం లేదనే కోపంతో మరుగుతున్న నూనెను ఒంటిపై పోసి తీవ్రంగా గాయపరిచాడు. శనివారం గుంటూరు జిజిహెచ్‌లో చికిత్స పోందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటటరావు తెలిపారు.

వేలం పాటలో రూ.1,05,462 ఆదాయం

ప్రజాశక్తి- అచ్చంపేట

అచ్చంపేట పోలీస్ స్టేషన్లో ద్విచక్ర వాహనాలకు ఏర్పాటు చేసిన వేలం పాటలో రూ.1,05,462లక్షల ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందని పోలీసులు తెలిపారు. శనివారం పల్నాడు జిల్లా, సత్తెనపల్లి సబ్ డివిజన్, అచ్చంపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది వారిచే పలు కేసులలో సీజ్ చేయబడిన 6 మోటార్ సైకిళ్ళు, ఒక కారు వాహనానికి ఎస్‌డిపిఓ, సత్తెనపల్లి వారి ఉత్తర్వుల మేరకు పెదకూరపాడు సిఐ , అచ్చంపేట ఎస్ఐ కే రవీంద్రబాబు ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ప్రభుత్వం వారి అప్ సెట్ వేల్యూ ప్రకారం 5 మోటార్ సైకిళ్ళు, ఒక కారు ధర రూ.76,000లు ఉండగా వేలంపాట ద్వారా రూ. 1,05,462లకు వాటిని వేలంపాటలో పాటదారులు దక్కించుకున్నారు. ఒక స్కూటీ మోటార్ సైకిల్ ను ఎవరూ వేలం పాట పాడలేదు

విద్యార్థుల విజ్ఞానమే దేశానికి అవసరం

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

విద్యార్థుల విజ్ఞానమే ఈ దేశానికి అవసరమని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఏంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో గల కృష్ణవేణి ఐటిఐ మహిళా కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో విద్యార్థినీలకు కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ మేధావి బాబాసాహెబ్ అంబేద్కర్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం లాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నతి స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా సమాజంలో ప్రతి ఒక్కరికి విద్య అవసరమని, పేదరికం విద్యకు అడ్డు కాదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో జువారి సిమెంట్ వారు సౌజన్యంతో దృష్టిలోపంతో బాధపడుతున్న విద్యార్థిణులకు కళ్ళజోళ్ళ పపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి, కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, ఐటిఐ కళాశాల యాజమాన్యం అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

భర్త కనబడటం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి- దుగ్గిరాల

గత వారం రోజుల నుండి తన భర్త కమ్మవరపు శ్రీనివాసరావు ఆచూకీ తెలియడం లేదని రేవేంద్రపాడు గ్రామానికి చెందిన కమ్మవరపు విజయలక్ష్మి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. తన భర్త శ్రీనివాసరావు శ్రీ కాళహస్తిలోని లాంకో సంస్థలో పనిచేస్తుంటాడని తల్లితండ్రులు పోషనార్థం ఏడాది నుండి రేవేంద్రపాడులో నివాసం ఉంటున్నాడని తెలిపారు. సంస్థలో పనిచేస్తూ సెలవు దినాల్లో స్వగ్రామానికి వస్తుంటాడని ఈ క్రమంలో వారం రోజుల క్రితం రేవేంద్రపాడు గ్రామం వచ్చి వెళ్లిపోయాడని తెలిపారు. ఎక్కడికి వెళ్ళింది తెలియలేదని, ఫోన్ పనిచేయటం లేదని, శ్రీ కాళ హస్తి వెళ్లి వాకబు చేయగా అక్కడకు రాలేదని వారు తెలపడంతో భార్య విజయలక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నిడమర్రు రోడ్డులో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి- మంగళగిరి



పట్టణ పరిధిలోని నిడమర్రు రోడ్డులో డంపింగ్ యార్డ్ సమీపంలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంగళగిరి అగ్నిమాపక అధికారి వై వెంకటేశ్వర్లు వివరాలు ప్రకారం రూ.1.50లక్షల విలువ చేసే వాటర్ పైప్ లైన్‌లు దగ్ధమయ్యాయని తెలిపారు. పక్కనే చెత్తాచెదారం ఉండడంతో సిగరెట్లు కాల్చి వేయడం తో ఈ ప్రమాదం సంభవించిందన్నారు.

నేడు ముస్లిం మైనారిటీల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-తెనాలి

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ముస్లిం మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు సిటి స్కాన్ అధినేత, వైసిపి నాయకులు డాక్టర్ మహమ్మద్ రియాజ్‌ఖాన్, జేబి స్టీల్స్ అధినేత షేక్ జిలాని ప్రకటించారు. స్థానిక వహాబ్ రోడ్డులో నిర్వహించే ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిదులుగా స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో పాటు డిప్యూటీ సిఎం, మైనారిటీ వెల్ఫేర్ మనిస్టర్ షేక్ అంజాద్ భాషా, రాజ్యసభ సభ్యులు ఆళ్ళ ఆయోధ్య రామిరెడ్డి పాల్గొంటారన్నారు.

మట్టి నమూనాల పరీక్షలకు శిక్షణ



కుంచనపల్లిలో మట్టి పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపలిలో రైతు భరోసా కేంద్రం సిబ్బందికి మట్టి నమూనాల సేకరణ పై శిక్షణ కార్యక్రమం శనివారం వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి ఆత్మకూరు శ్రీనివాసులు మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేయడం ద్వారా రైతులకు తమ పొలంలో ఎంత ఎరువు వేయాలో, భూమి ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలో తెలుస్తుందని అన్నారు. రైతులందరూ తప్పకుండా మట్టి పరీక్షలు చేయించుకోవాలని మంగళగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏజీ బీఎస్సీ విద్యార్థి కే.కీర్తనరాజన్ ప్రకృతి వ్యవసాయంలో ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వాడడం వలన నేల సారం, ఆరోగ్యం వృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతు భరోసా కేంద్రం అధికారిని వల్లభనేని శిరీష, గ్రామ రైతులు అమ్మిశెట్టి ఆదియ తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు: మండలంలోని నాగులపాడు ఆర్‌బికేలో మండల వ్యవసాయ అధికారి బి సుధారాణి అధ్యక్షతన విఏఏ, వీహెచ్‌ఏలు, గ్రామ రైతులకు భూసార పరీక్ష మరియు మట్టి నమూనాల సేకరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుధారాణి మాట్లాడుతూ నేలలో సహజంగా ఉన్న పోషకాలు స్థాయిని తెలుసుకొని పంటలకు ఎరువుల మోతాదు నిర్ణయించాలని సూచించారు .అనంతరం మట్టి నమూనాల సేకరణ గురించి శిక్షణ ఇచ్చారు.

ఫిరంగిపురం :మండలంలోని రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల , విస్తరణాధికారులకు గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు జి శ్రీనివాసరావు అధ్యక్షతన మండల వ్యవసాయ అధికారి కే రమణ కుమార్ మట్టి పరీక్షలపై శిక్షణ నిర్వహించారు.కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు గుంటూరు రెగ్యులర్ జి శ్రీనివాసరావు, ,మండల వ్యవసాయ అధికారి , కె రమణ కుమార్,వ్యవసాయ విస్తరణ అధికారి షేక్ సుభాని , గ్రామ వ్యవసాయ సహాయకులు ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

తుళ్లూరు:పెదపరిమిలో భూసార పరీక్ష ప్రాధాన్యత పై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కె శ్రీ రంజని మాట్లాడుతూ, భూసార పరీక్ష ప్రాధాన్యత పై విఎఎ,విహెచ్ఎ,రైతులకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని, భూసార పరీక్షల వల్ల ఒనగూరే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్వో,విఎఎ, విహెచ్ఎ లతో పాటు రైతులు అక్కల లక్ష్మి నారాయణ రెడ్డి, మున్నంగి కోటిరెడ్డి పాల్గొన్నారు



అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి-మాచర్ల

ప్రజల ప్రాణరక్షణ కోసం అగ్ని ప్రమాద నివారణ చర్యలు పాటించాల్సి ఉంటుందని ఇన్‌ఛార్జి ఎల్ఎఫ్ఒ ఎం. లక్ష్మయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలో పలు ప్రాంతాలలో అగ్ని ప్రమాద నివారణ గురించి శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగితే రక్షణ మార్గాలు తెలిసి ఉండాలన్నారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలు, చేయకూడని పనులు గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ ఫైర్‌మెన్ పి.వెంకటేశ్వరరావు, ఎస్ అప్పల నాయుడు, బి.ఆంజనేయులునాయక్, ఎన్ బాలకృష్ణ, డ్రైవర్ ఆపరేటర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

కౌలు ధర రాక..వేలం వాయిదా

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని గురిజవోలులోని షాహి మసీదు ఆధీనంలో ఉన్న 32 ఎకరాల పంట భూములను వర్క్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లా బాషా బహిరంగ వేలం నిర్వహించారు. గురిజవోలు గ్రామ సచివాలయంలో ఉదయం 10 గంటలకు జరిగిన వేలానికి హాజరైన నలు గురు, రూ.10 వేల చొప్పున ఒక్కొక్కరూ ధరావత్ చెల్లించి పాల్గొన్నారు. భూములకు సరైన కౌలు ధర రాకపోవడంతో అధికారులు వేలాన్ని వాయిదా వేశారు. అమీనాబాద్‌కు చెందిన రైతు 20 ఏళ్ల పాటు తనకు కౌలుకు ఇస్తే మామిడి తోట సాగు చేస్తానని చెప్పాడు. కలెక్టర్ అనుమతితో మరోసారి వేలం నిర్వహిస్తామని ప్రస్తుతం వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

ఆర్బికెలలో మొక్కజొన్న కొనుగోలు

ప్రజాశక్తి-ఈపూరు

ఆర్బికేలలో మొక్కజొన్న పంటను ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్న వారి వద్ద నుండి కొనుగోలు చేయడానికి శనివారం నుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ రామారావు తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర ఒక క్వింటాళ్లకు రూ.1962 గా నిర్ణ యించారన్నారు. అమ్ముకునే రైతులు ఆర్బికే లలో ఉండే గ్రామ వ్యవసాయ సహాయకులు,ఉద్యాన శాఖ సహాయకుల వద్దకు వెళ్లి వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత మార్క్‌ఫెడ్ అప్రూవల్ తర్వాత, రైతులకు నేరుగా కొనుగోలుపై సందేశం వస్తుందన్నారు.

'జనసేన'ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-ముప్పాళ్ల



దేశ సంస్కృతీ సంప్రదాయా లను ఇనుమడింపజేసి, ఐక్య తకు ప్రతీకగా నిలిచేది పవిత్రమైన రంజాన్ పండుగ అని సత్తెనపల్లి నియోజకవర్గ జనసేన నాయకులు బొర్రా వెంకటప్పారావు అన్నారు. మండల కేంద్రమైన ముప్పాళ్లలో శనివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటప్పారావు మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు కఠినమైన ఉపవాస దీక్ష చేపట్టి పవిత్రతను చాటిచెప్పే పండుగలలో రంజాన్ ప్రత్యేకమైందని అన్నారు .ఈ సంద ర్భంగా ముస్లింలకు ముందుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు శిరిగిరి పవన్ కుమార్,నాయకులు పఠాన్ లాల్ ఖాన్,షేక్ గౌస్, పఠాన్ బాజి,మోలాలి,మాబులా,నాగేశ్వరరావు,లక్ష్మీ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలపై ప్రచారం

ప్రజాశక్తి-వినుకొండ

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక నిరంకుశ విధానాలపై రెండో రోజు జరిగిన ప్రచార యాత్రలో సిపిఎం నాయకులు కె.హనుమంతరెడ్డి, పాల్గొన్న సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలం బిస్తున్నాయని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. వామపక్ష పార్టీల జాతీయ పిలుపు మేరకు రెండో రోజు వినుకొండ మండలంలోని కోటప్పనగర్, పెద కంచెర్ల, గోనుగుంట్ల వారి పాలెం, ఏనుగు పాలెం, పిట్టంబండ, ఉమ్మడివరం, నాగులవరం, గోకనకొండ తదితర గ్రామాల్లో సిపిఎం, సిపిఐ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు రెట్టింపు ఆదాయం వచ్చే విధంగా స్వామినాథన్ కమిటీ రిపోర్టులు అమలు చేస్తామని, రైతు పండించిన పంటకు గిటుబాటు ధరలు కల్పిస్తామని, పెరిగిన ధరలు వంద రోజుల్లో తగ్గిస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు నిరుద్యోగులకు కల్పిస్తామని చెప్పి యువతను మోసం చేశారని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందని, రైతన్నలు అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మ హత్యలు పాలవుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఆర్టిసి ఛార్జీలు, ఇంటి పన్ను, నీటి పన్ను, చెత్త పన్ను, ఈ విధంగా ప్రజలపై భారం వేసి వారిని ఇబ్బందుల పాలు చేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివరామకృష్ణ, మస్తాన్ బి, వినుకొండ మండల సిపిఐ నాయకులు కార్యదర్శి బూదాల సాగర్, బొల్లాపల్లి మండల కార్యదర్శి పిన్న బోయిన వెంకటేశ్వర్లు, నూజెండ్ల మండల కార్యదర్శి ఎ. పవన్‌కుమార్, ఆర్.వందనం, మల్లికార్జున, బాజీ, బుజ్జి పాల్గొన్నారు.



వినుకొండలో



నరసరావుపేటలో

ప్రజాశక్తి-నరసరావుపేట

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిర్వహిస్తున్న ప్రచార యాత్రలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి ప్రజలను కోరారు. ప్రచారయాత్రలో భాగంగా రెండవ రోజున పట్టణంలోని వినుకొండ రోడ్డులో ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. డి.శివకుమారి మాట్లాడుతూ దేశ ప్రజల బాగోగులు కన్నా అంబానీ, ఆదానీల ఆస్తులు పెంచే పనిలో ప్రధాని మోడీ ఉన్నారని ఎద్దేవా చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం ప్రజలను చైతన్యపర్చాల్సిన బాధ్యత గల కమ్యూనిస్టులుగా ప్రచారం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలపై ప్రజలు స్పందించి సహకరించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో సిపిఎం ఆంజనేయ నాయక్, పెద్దిరాజు, గౌస్, సిపిఐ నాయకులు పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, యు. రాజు, నాగరాజు, నాగేశ్వరరావు సుబ్బారావు గౌసు గురవయ్య పాల్గొన్నారు.

వేసవిలో అసవసరంగా బయటకు రావొద్దు

ప్రజాశక్తి-అమరావతి



ముందస్తు జాగ్రత్తలతో మండు వేసవిని అధిగమిద్దామని తహశీల్దారు జె. విజయశ్రీ అన్నారు. ప్రజలు వడ దెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న రెండు నెలల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై ప్రతిఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని కోరారు. వడ గాల్పులపై ప్రజలకు అవగాహన కల్పించి తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చలివేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. వేసవిలో అనవసరంగా ప్రజలు బయటకు రావద్దని అన్నారు. అత్యవసర పనులను ఉదయమే పూర్తి చేసుకోవాలని సూచించారు. త్వరలో కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మార్వో జె.విజయశ్రీ, ఆర్ ఐ రాజశేఖర్ తెలిపారు.

గంగినేని ఫౌండేషన్ విరాళం

ప్రజాశక్తి-వినుకొండ



స్థానిక గుంటి ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో గత నాలుగు నెలలుగా నూతనంగా నిర్మాణం అవుతున్న అపరకర్మల ధర్మ సత్రం నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో దీని నిర్మాణానికి తమ వంతు ఆర్థిక సహాయంగా గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగినేని రాఘవరావు తరపున రూ. 10,116 విరాళాన్ని అందజేశారు.ఈ విరాళాన్ని ఆలయ చైర్మన్ చుండూరి శ్రీమన్నారాయణకు , ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ శివలింగ ప్రసాద్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ అపరకర్మల సత్రం నిర్మించడంపై హర్షం వ్యక్తం చేస్తూ నిర్మాణ కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాతలకు ధన్యవాదాలు తెలియజేస్తూ త్వరితగతిన ఈ నిర్మాణం పూర్తయితే పట్టణంలోని ప్రజలకు కర్మకాండలు నిర్వహించుకునేందుకు అవకాశం లేని వారు, అద్దె ఇళ్లలోని వారికి ఈ అపరకర్మల సత్రం ఉపయోగపడుతుందని నిర్మాణం వేగవంతంగా జరుగుతుందని అన్నారు. అదేవిధంగా దాతలు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులతో పాటు సోమేపల్లి శ్రీనివాసరావు, గంగినేని బాబు, గుత్తా గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతలతో వైవి ఆంజనేయులు ముఖాముఖి


ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,ముఖ్య నాయకులు, కౌన్సిలర్ లు, మాజీ కౌన్సిలర్లను మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు కలిశారు. పట్టణంలో శనివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు.వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పార్టీ పురోబి, వృద్ధికి, పార్టీ బలోపేతం దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని వారితో ముఖాముఖి చర్చించారు.ఈ క్రమంలో కొందరు కార్యకర్తల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసు కున్నారు. వారికి ఆర్థిక సాయం చేశారు.

పురపాలక సంఘ కార్యాలయంలో మజ్జిగ పంపిణి

ప్రజాశక్తి-మాచర్ల



వేసవిలో ఎండల తీవ్ర దృష్ట్యా మాచర్ల పురపాలక సంఘం కార్యాలయంలో చేపట్టిన మజ్జిగ పంపిణి కార్యక్రమం కొనసాగుతోంది. వివిధ పనులపై పురపాలక సంఘ కార్యాలయానికి మండుటెండలో వస్తున్న ప్రజల దాహార్తిని తీర్చేందుకు, వడదెబ్బ తగలకుండా ఉండేందుకు మజ్జిగ పంపిణి కార్యక్రమం చేపట్టినట్లు కమిషనర్ ఇవి రమణబాబు తెలిపారు. పలువురు పెద్దల సూచన మేరకు మజ్జిగ పంపిణి కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా హోమియో మందులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



వడదెబ్బ బారిన పడకుండా హోమియో మందులు పంపిణీ చేశారు.రోటరీ క్లబ్ ఆఫ్ , ఏ కే హోమియో కేర్ సంయుక్త ఆధ్వర్యంలో సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న రామాలయం వద్ద శనివారం హోమియో మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ షేక్ షమ్మి ముఖ్యఅతిథిగా హాజరై మందులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎండ వేడిని తాళలేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి తరుణంలో వడదెబ్బ బారినపడకుండా ఈ మందులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. డాక్టర్ అయోధ్య కృష్ణ మాట్లాడుతూ హోమియోపతికి ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా రోగికి రోగనిరోశక్తిని పెంచే విధంగా ఉంటుంది అని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పాయసం మహేష్ బాబు, జిల్లా సమన్వయకర్త బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, ట్రెజరర్ స్వామినాథన్ బాలసుబ్రమణ్యం, సరికొండ రమాదేవి, మాతంగి సాంబశివరావు, తుమ్మల వెంకటేష్, షేక్ సుబాని పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపిని సాగనంపుదాం

సిపిఎం, సిపిఐ ప్రచార భేరీలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజా వ్యతిరేక విధానాలను, మతోన్మాద విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపుదామని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు సిపి ఎం, సిపిఐ మంగళగిరి పట్టణ కమిటీల ఆధ్వర్యంలో జరిగే ప్రచార బేరి కార్యక్రమంలో భాగంగా శనివారం మంగళగిరి పట్టణంలోని ఒకటో వార్డులో పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా 2,3,4 వార్డుల్లో పర్యటించిన సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవహర్లాల్, సిపిఐ నియోజకవర్గ నాయకులు కంచర్ల కాశయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలం బిస్తూ ప్రజలపై భారాలు వేస్తుందన్నారు. పేదలకు విద్యా వైద్యం అందని విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. దళిత గిరిజన ప్రజల సంక్షేమానికి, సామాజిక న్యాయా నికి బిజెపి విధానాల వలన దూరమై పోతున్నారని అన్నారు. ఇం టింటికి వెళుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, సిపిఎం పట్టణ నాయకులు ఎస్ వెంకటేష్, ఎస్ గణేష్, ఎం బాలాజీ, కె.నాగేశ్వరరావు, కే వెంకటేశ్వర్లు, జగన్నాథం, జి వీరబాయి, సిపిఐ నాయకులు జె జాన్ బాబు, ఏ ప్రభాకర్, చిన్ని సత్యనారాయణ, పి.నాగేశ్వరావు, బి మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం 4వ వార్డు ప్రచారంలో సిపిఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



తాడేపల్లిలో..

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలపై ఏప్రిల్ 14 నుండి సిపియం, సిపిఐ సంయుక్తంగా చేపట్టిన ప్రచార భేరిలో భాగంగా శనివారం రెండో రోజు స్థానిక పాతగుంటూరులో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపాత్రాలు పంపిణీ చేశారు. పాతగుంటూరు మెయిన్ రోడ్డు, ఆంధ్రాబ్యాంకు రోడ్డు, బాలాజీ నగర్, సుద్దపల్లిడొంక, అలీనగర్ ప్రాం తాల్లో ప్రచారం చేపట్టారు. ఈ కార్య క్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, సిపియం నగర కార్యదర్శి కె.నళినీ కాంత్ మాట్లాడుతూ దేశ ప్రజలకు ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఏపీకి విభజన హామీలు విస్మరిం చిందని విమర్శించారు. హామీలు నెర వేర్చకపోగా కార్మికులు హక్కులు కాల స్తున్నారని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వారికి కట్టబెడుతున్నారని మండి పడ్డారు. దేశాన్ని కాపాడుకోవాలంటే మోడీని గద్దె దింపాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి మాల్యాద్రి, నాయకులు అరుణ్, అంజి బాబు, యశ్వంత్, చైతన్య, సిపియం స్థానిక శాఖ కార్యదర్శి ఎస్.కార్తీక్, నగర నాయ కులు నికల్సన్, అరుణ, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు నగర కార్యదర్శి కె.నళినీకాంత్

ప్రజాశక్తి-తాడేపల్లి

బిజెపిని సాగనంపుదాం.. . దేశాన్ని కాపాడుకుందాం అంటూ ఏప్రిల్ 14 నుంచి 30 వరకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జరిగే ప్రచారభేరి పోస్టర్‌ను శనివారం తాడేపల్లి పట్టణంలోని మేకా అమరారెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి తెగనమ్ముతోందన్నారు నిరంకుశ ఫాసిస్టు మతోన్మాద విధానాలను అవలంభిస్తోందని దుయ్యబట్టారు. తాడేపల్లి పట్టణం కృష్ణనగర్‌లో 18న, 19న తాడేపల్లి సెంట్రల్, 20న సుందరయ్యనగర్, సీతా నగరం ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తు న్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తెలిపారు. 24న మంగళగిరిలో జరిగే బహిరంగ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.సుబ్బారెడ్డి, నాయకులు కె. కరుణాకరరావు, వి.దుర్గారావు, సోలా ముత్యాలరావు, డివి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

తాడికొండలో ప్రచార భేరీలో బస్టాండ్ సెంటర్ నుండి రావి చెట్టు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకర్ రావు, సిపిఎం మండలకార్యదర్శి చింతల భాస్కరరావు, రైతు సంఘం నాయకులు గుర్రంకొండ సత్యానందం, కనకాల పూర్ణచంద్రరావు, టి వెంకటేశ్వర్లు, తాడపోయిన శ్రీనివాసరావు, వై నరసింహారావు పాల్గొన్నారు.

పెనుమాకలో: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజలు కదలి రావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వై నేతాజీ పిలుపు నిచ్చారు. శనివారం రాత్రి రాజధానిలోని పెనుమాకలో నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌కె పీరుసాహేబ్, ఎస్‌కె ఖాదర్ బాబు, వి వెంకటేశ్వరరావు, పి గాంధీ తదితరులు పాల్గొన్నారు.



పెదకాకానిలో...



దుగ్గిరాలలో..

ప్రజాశక్తి -దుగ్గిరాల

సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచార భేరీ మండలంలో రేవేంద్రంపాడు, శృంగారపురం, గొడవర్రు, పెద్ద కొండూరు, చిన్నపాలెం, పెద్దపాలెం, పేరకలపూడి, చిల్లరగొల్లపాలెం, ఈమని గ్రామాలలో విస్తృతంగా కరపత్రాలు పంపిణీ సాగింది. ఈ సందర్భంగా రేవేంద్రపాడు గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తి గొంతు ఎత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయవలసిన సమయం వచ్చిందని లేకుంటే మనందరి భవిష్యత్తు చీకటమయమౌతుందని తెలిపారు. దేశ స్వతంత్రం ప్రమాదంలో పడిందని దాన్ని కాపాడుకోవడానికి మనం ఆనాటి స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. సిపిఐ మంగళగిరి నియోజకవర్గ నాయకులు కంచర్ల కాశయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను దగా చేసిందని ప్రత్యేక హోదా, రాజధానికి నిధులు పోలవరానికి నిధులు, విశాఖ రైల్వే జోన్‌కు నిధులు కేటాయించకుండా మోసం చేసిందని తెలిపారు. సిపిఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతు ఏప్రిల్ 24న మంగళగిరిలో జరిగే బహిరంగ సభకు ప్రజలు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు వి సాంబశివరావు, వై బ్రహ్మేశ్వరరావు, కరీముల్లా, బాజ్జి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధనాలను నిరసిస్తూ పెదకాకాని సెంటర్‌లో సిపిఎం, సిపిఐ నాయకులు ప్రచార భేరీలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజి, సిపిఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యన్నారాయణ ప్రసంగించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన విశాఖ స్టీల్, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, ఎయిరిండియా తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడంతో పాటు ఆదానికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వానికి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పి తగిన గుణ పాఠం నేర్పాలన్నారు. కార్యక్రమంలో కోటిపల్లి సత్యనారాయణ, వి శివయ్య, ఆర్ శ్రీనివాసరావు, గోవి, సుబ్బారావు పాల్గొన్నారు.



తాడికొండలో....



పెనుమాకలో..



మంగళగిరిలో



మనల్ని పెంచేది.. గెలిపించేది చదువు మాత్రమే

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్

ప్రజాశక్తి- మంగళగిరి

మనల్ని సమాజంలో పెంచేది, గెలిపించేది చదువు మాత్రమేనని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్ అన్నారు. జస్టిస్ ఎం.గంగారాం ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన సందర్భంగా శనివారం రాత్రి మంగళగిరి వీటీజెఏం అండ్ ఐ వి టి ఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఆయన్ని బహుజన న్యాయవాదుల సంఘం ఘనంగా సత్కరించింది. కార్యక్రమానికి డిసిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది ఉప్పుటూరి వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ నగేష్ మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెట్టాలంటే చదువు ఒకటే మార్గమని చెప్పారు. అలాంటి చదువుని కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, కసితో చదవాలని చెప్పిన ఆయన, ఉదాహరణలు చెబుతూ చేసిన ప్రసంగం స్ఫూర్తిదాయకంగా ఉంది. తన తండ్రి ఎమ్మెల్యే అయినప్పటికీ మొదట్లో విద్య విలువ తెలియలేదని తెలుసుకున్న తర్వాత వెనుతిరిగి చూడలేదని కసిగా చదివానని నాలుగు కోట్ల మంది జనాభా ఉన్న రాష్ట్రానికి తాను హైకోర్టు న్యాయమూర్తిగా నియమింపబడ్డానని అన్నారు. సన్మాన గ్రహీత గంగారావు మాట్లాడుతూ న్యాయవాదులు ప్రతిరోజు అధ్యయనం చేయాలని, కేసుపట్ల అవగాహన పెంచుకొని కోర్టుకు రావాలని తద్వారా ఉత్తమమైన న్యాయవాదులుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. మరొక ముఖ్య అతిథి తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పల్లె నాగేశ్వరరావు మాట్లాడుతూ బహుజనలందరూ ఐక్యతతో క్రమ శిక్షణతో ఉంటే ఇలాంటి అధికారాలు చాలా పొందవచ్చని అన్నారు.. అనంతరం అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో ఎపి హైకోర్టు సీనియర్ న్యాయవాదులు, జి ఎలీషా,ః,వైకె శ్రీధర్, బషీర్, శివాజీ, హైకోర్టు న్యాయవాది, ఆర్బిటరేటర్ డి వెంకట నరసింహం, మహిళా న్యాయవాదులు శోభ రాణి, రాధా కుమారి, రమణి తదితరులు పాల్గొన్నారు.



తులసీ సీడ్స్ ఉపకారవేతనాల పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల 81వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తులసీ గ్రూప్ చైర్మన్ తులసిరామచంద్రప్రభు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థినులకు రూ.40వేలు ఉపకారవేతనాలను తులసి రామచంద్రప్రభు అందచేశారు.సభలో రామచంద్రప్రభు మాట్లాడుతూ విద్యార్థినులు చదువు మాత్రమే కాకుండా వ్యాపార, వాణిజ్య, రాజకీయ రంగాలలో పురుషుల కన్నా మిన్నగా ముందుకు దూసుకెళ్లాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నాలుగు లక్షల రూపాయల చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విఆర్ జోత్స్నకుమారి మాట్లాడుతూ 8 దశాబ్దాల కళాశాల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు దాతల సహకారం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి, ఆడిటర్ లీలా కష్టమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ యం.నిర్మలకుమారి, స్టూడెంట్ యూనియన్ కన్వీనర్ కె.సుబ్బరత్తమ్మ, స్టూడెంట్ లీడర్ జవేరియా పాల్గొన్నారు.



ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-నరసరావుపేట

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను పండగ వాతావరణంలా జరుపుకోవడంపై మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం రాత్రి ప్రభుత్వ ఆదేశాల మేరకు అంబేద్కర్ జయంతి వేడుకలను కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ విభాగం ఘనంగా నిర్వహించింది. ముఖ్యఅతిథిగా డొక్కా మాణిక్య వరప్రసాద్ హాజరయ్యారు. తొలుత కలెక్టరేట్ ఆవరణ లో అంబే ద్కర్ ఫోటో గ్యాలరీ, పలు ప్రసంగాలు, ప్రచురణలు, జీవిత చరిత్ర, స్వాతంత్ర్యం ముందు తరువాత వంటి అంశాలకు సంబంధించి ఎగ్జిబిషన్ ను కలెక్టర్‌తో కలిసి పలువురు అతిథులు ప్రారంభించి, తిలకించారు. అక్కడ ఏర్పాటు చేసిన గంటను అతిథులు మోగించి సమసమాజ స్థాపనకు చేస్తున్న కృషికి మద్దతు తెలిపారు. అంతకు ముందు విద్యార్థినీ విద్యార్థులతో స్ఫూర్తిదాయక కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం మాణిక్య వరప్రసాద్ అంబేద్కర్ జయంతి వేడుకల నిర్వహణ కు గల కారణాలను వివరించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం పలు వురికి భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా జిల్లా రెవెన్యూ శాఖ అధికారి వినాయకం, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ స్ఫూర్తి అందరికీ ఆదర్శం

ప్రజాశక్తి-రెంటచింతల

బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురు కుల పాఠశాలలో శనివారం అంబేద్కర్ చరిత్రను 9వ తరగతి విద్యార్థులు నాటిక రూపంలో ప్రదర్శించారు. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ విద్యార్థి ప్రయోజకుడు కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.మోహన్ పాల్గొన్నారు.



తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా షేక్ ఖాన్ సాహెబ్

ప్రజాశక్తి-అమరావతి

పెదకూరపాడు నియోజకవర్గ తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా షేక్ ఖాన్ సాహెబ్ ను నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ నియామకపత్రాన్ని అందజేశారు. 16వ తేదీన నరసరావు పేటలో ప్రమాణ స్వీకారం మహోత్సవానికి కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాల్సిందిగా ఖాన్ సాహెబ్ కోరారు.

జీవితాలకు కొత్త వెలుగులు

ప్రజాశక్తి-నరసరావుపేట

స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్, పుట్టుకతో మూగ, చెవిటి పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ద్వారా ఇంప్లాయెన్స్ అమర్చి వారి యొక్క జీవితాలకు కొత్త వెలుగులు నింపిందని కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రశంసించారు.శనివారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ శివ శంకర్ ,డి సి ఎస్ చ్ డా. బి వి రంగా రావు, అర్బన్ డెవలప్మెంట్ అథా రిటీ డైరెక్టర్ మిట్టపల్లి రమేష్ పాల్గొని స్విచ్ ఆన్ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాకే గర్వకారణంగా మొట్ట మొదటి సారిగా పదిమంది పుట్టుకతో మూగ, చెవిటి ఉన్న పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ద్వారా ఇంప్లాయెన్స్ అమర్చిన అంజిరెడ్డి హాస్పిటల్‌కు ధన్యవాదాలు తెలి పారు. అంజిరెడ్డి హాస్పిటల్ ఆధ్వ ర్యంలో కాక్లియర్ ఇంప్లాంట్స్ స్పీచ్ ఆన్ పరికరాలను అందించారు. వినికిడిలోపంతో బాధ పడుతున్న వారికి రూ.1 కోటి విలువ చేసే పరికరాలను అందించారు.



వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్



మెగా సర్వేకు విశేష స్పందన: మంత్రి అంబటి

ప్రజాశక్తి-నరసరావుపేట

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7 ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై మెగా పీపుల్స్ సర్వే కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని మంత్రి అంబటి రాంబాబు,ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అంబటి మాట్లాడుతూ వారం రోజుల్లో వైసిపికి 7 లక్షల మంది సైనికులు 61 లక్షల కుటుంబాలకు చేరువయ్యాయని అన్నారు. ప్రభుత్వంపై తమ విశ్వాసాన్ని 47 లక్షల మంది 82960 82960 మిస్డ్ కాల్ ఇచ్చి వ్యక్తం చేశాయన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని, రాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేనివిధంగా రాష్ట్ర తలసరి ఆదాయం అత్యధికంగా పెరుగుతోందన్నారు. మెగా పీపుల్స్ సర్వేకు వస్తున్న అపూర్వ స్పందన చూసి టిడిపి, జనసేన తట్టుకోలేక సర్వేపై విషం చిమ్మేలా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా విజ్ఞాన వారోత్సవాలు

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలోని జాషువా కళా ప్రాంగణంలో దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న విజ్ఞాన వారోత్స వాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132 వ జయంతి సభ జరిగింది. కార్యక్రమానికి పల్నాడు జిల్లా ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు మరియు విజ్ఞాన వారోత్సవాల కన్వీనర్ పెద్దిటి పౌలేష్ అధ్యక్షత వహించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వినుకొండ మున్సిపల్ చైర్మన్ షేక్ షకీలా దస్తగిరి ,విశిష్ట అతిథిగా విచ్చేసిన వినుకొండ కోర్టు ఏ. జి. పి. న్యాయవాది ఎం. ఎన్. ప్రసాద్ మాట్లాడారు. విను కొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన న్యాయవాది చాగంటి వీరాంజనేయ చౌదరిని ఈ సందర్భంగా నిర్వాహకులు సత్కరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బంగారు ,రజిత, కాంస్య పతకాలను అందించారు. ఈ సందర్భంగా వినుకొండ మండల పరిషత్ అధ్యక్షులు పగడాల జయ శ్రీ వెంకటరామిరెడ్డి ఏర్పాటు చేసిన పది వేల రూపాయలను పేద విద్యార్థు లకు ఐదువేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని కన్వీనర్ పౌలేష్ అందజేశారు.



సాగునీరు అందించలేని రాష్ట్ర ప్రభుత్వం-బిజెపి

ప్రజాశక్తి-మాచర్ల

వరి పంట చేతికి వచ్చే సమయంలో సాగునీరు అందించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు గుమ్మడి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా బిజెపి ఆధ్వర్యంలో కుడికాలువకు తక్షణమే సాగునీరు అందించాలని రిలే నిరహారదీక్షను చేపట్టారు. పోలీసులు టెంట్ వేయకుండా చేయటంతో రోడ్డు మార్జిన్‌లో క్రింద కుర్చొని బిజెపి నాయకులు దీక్షను కోనసాగించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి నాసరయ్య, పాశం మట్టారెడ్డి, గంగిశెట్టి చిననాసరయ్య, క్రాంతికుమార్, బ్రహ్మయ్య, వరప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

చదలవాడ అరవింద బాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-నరసరావుపేట



స్థానిక టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో నరసరావుపేట నియోజకవర్గ టిడిపి భాద్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు జన్మదిన వేడు కలు శనివారం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజ నేయులు,చదలవాడకు అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక టిడిపి నాయకులు భారీ కేక్ కటింగ్, గజమాలతో సత్కరించి, బాణాసంచకాల్చారు.

కాంగ్రెస్.. ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-మాచర్ల



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూరల్ గ్రామాలలో 'మోది హటావో-దేశ్‌కో బచావో' నినాదాన్ని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ డాక్టరు యరమల రామచంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని భైరవునిపాడు, తాళ్ళపల్లి, కొత్తూరు, పశువేముల గ్రామాలలో శనివారం ఇంటింటి ప్రచారం చేపట్టి రాహుల్‌గాంధీ సందేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా డాక్టరు యరమల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో మోదికి జగన్ భయపడి మోది పాలనను కోనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు రూ.3 లక్షల రుణమాఫీ, ప్రత్యేక హోద, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, రూ 500కే గ్యాస్ సరఫరా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. పెట్రోల్‌ను జిఎస్‌టిలోకి తెచ్చే సత్తా కూడ కాంగ్రెస్‌కే ఉందన్నారు. మోది ప్రభుత్వాన్ని గద్దె దింపకపోతే జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించారు. ప్రచార కార్యక్రమంలో నాయకులు చిమటా వెంకటేశ్వర్లు, వంగపాటి నాగరాజు, దొడ్డా శ్రీనివాసరావు, అచ్చయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కేసుల నమోదు సిగ్గుచేటు: కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సాగునీరు అడిగిన రైతులపై వైసిపి ప్రభుత్వం కేసులు నమోదు చేయటం సిగ్గు చేటు మాజీ మంత్రి టిడిపి నేత కన్నా లక్ష్మినారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలంలో కన్నా లక్ష్మీనారాయణ శనివారం విస్తృతంగా పర్యటించారు. కట్టా వారిపాలెం , కంటెపూడి, రామకష్ణాపురం, నందిగామ, గుడిపూడి, ఫణిదం భట్లూరు, గుజ్జర్లపూడి, గోరంట్ల కట్టమూరు గ్రామాల్లో పర్యటించారు, ఆత్మీయ కలయికలో భాగంగా టిడిపి మండల నాయకులను మర్యాద పూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మినారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగ న్మోహన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ లో కూర్చుంటే ప్రజా సమస్యలు రైతుల బాధలు ఎలా తెలుస్తాయని విమర్శించారు . ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రైతు భరోసాకు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-రెంటచింతల

మండలంలో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా కోసం నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి శనివారం కోరారు రైతు భరోసా పడని రైతులు రైతు భరోసా కోసం పొలం పాస్, పుస్తకం, బ్యాంకు ఎకౌంటు,ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను కార్యాలయంలో ఇవ్వా లన్నారు అలాగే ఎవరైనా చనిపోయిన రైతులు వారి నామిని బ్యాంక్ ఎకౌంటు, ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణపత్రం జిరాక్సు ఇవ్వాలని ఆయన ఈ సం దర్భంగా తెలిపారు

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-వినుకొండ

రాష్ట్రంలో పెన్షనర్ల న్యాయమైన కోరికలను ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ చేస్తూ వినుకొండ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో వినూత్న రీతిలో శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. దీనిలో భాగంగా నరసరావుపేట రోడ్డులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వద్దకు ర్యాలీగా చేరి 9 అంశాలతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి సమర్పించడమైనది.

ఆంజనేయ కాలనీలో అన్నదానం

ప్రజాశక్తి -మంగళగిరి: పట్టణంలోని ఆంజనేయ కాలనీలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా శనివారం శ్రీ సీతారామ భక్త సమాజం నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జి ధనుంజయరావు, వి లక్ష్మయ్య, టి అరుణ్ బాబు, జి శ్రీమన్నారాయణ, మండ్రు శ్రీను పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- మంగళగిరి:మంగళగిరిలో గల ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ గేటు వద్ద తాగునీటి చలివేంద్రాన్ని ఏపిఎస్పి డిఐజి సిహెచ్ వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రజలు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లుగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో కమాండెంట్ కెఎస్ఎస్ వి.సుబ్బారెడ్డి,అడిషనల్ కమాండెంట్ సాయి ప్రసాద్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్: ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరంలోని రాధారంగానగర్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా సుమారు రూ.31 లక్షల కార్పొరేషన్ నిధులతో నిర్మించిన కాంపౌండ్ వాల్ పనులను, రూ.7లక్షలతో నిర్మించినటువంటి గ్రావెల్ రోడ్డును ఆయన పరిశీలించారు. అనంతరం ఎలక్ట్రికల్ పోల్స్, డ్రైన్లు, కమ్యూనిటీహాల్ ప్రాంతంలో మెరకలు తోలాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే పనులను ప్రారంభించాలని కార్పొరేషన్ అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం వైసిపి గ్రామనాయకులు కత్తిక మల్లికార్జునరావు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను పరిశీలించిన ఎమ్మెల్యే

మంగళగిరి రూరల్:మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం కేటాయించనున్న ఇళ్ల స్థలాలను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. నవులూరు గ్రామ పరిధిలో సుమారు 63 యకరాలు, ఎర్రబాలెం గ్రామ పరిధిలో సుమారు 130 ఎకరాలు, కృష్ణయపాలెం పరిధిలో సుమారు 100 ఎకరాలు, నిడమర్రు గ్రామ పరిధిలో సుమారు 176 ఎకరాల ఇళ్ల స్థలాలను రెవెన్యూ అధికారులతో, సర్వేయర్లతో కలిసి పరిశీలించారు. అతి త్వరలోనే లేఔట్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆర్కే సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

20న కేంద్ర మంత్రి శ్రీశైలం రాక

ప్రజాశక్తి- మంగళగిరి:ఈ నెల 20వ తేదీన శ్రీశైలంలో అన్నదాన సత్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్రమంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ ఖాటిక్ వస్తున్నట్లుగా రాష్ట్ర ఆరెకటిక సంఘం మాజీ అధ్యక్షులు, ఆరెకటిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కె శివరాం బాబాజీ శనివారం మంగళగిరిలో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీన జంగాల్సిన కార్యక్రమం అనివార్య కారణాల వలన వాయిదా పడిందని తెలిపారు. 20వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని, ఆరెకటిక సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరతిగతిన పూర్తి చేయాలి : కలెక్టర్

పజాశక్తి- మేడికొండూరు

మండలంలోని పేరేచర్లలోని జగనన్న కాలనీ లే అవుట్లలో ఇంటి నిర్మాణాల పురోగతిని శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి క్షేత్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని ధృష్టిలో పెట్టుకొని వేసవి కాలంలోనే ఇళ్ల నిర్మాణాల త్వరతగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సాయినాథ కుమార్ లే అవుట్‌లోని గృహ నిర్మాణాల పురోగతిపై జిల్లా కలెక్టర్‌కు వివరిస్తూ, ఈ లే అవుట్‌లో ఆప్షన్ 3 క్రింద 9533 ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని, ఇప్పటి వరకు 3588 గృహాలు బేస్మెంట్ వరకు అయ్యాయని, లింటల్ స్థాయి వరకు 19 గృహాలు, రూఫ్ లెవెల్ వరకు 80 గృహాలు ఉన్నాయని, 34 గహాలు పూర్తి స్థాయిలో నిర్మాణాలు అయ్యాయన్నారు. ఇంకనూ 4237 గృహాల నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. జీఎంసీ అధికారులు ఈ విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఒక వారం రోజులలోపు మార్కింగ్‌లు వేసి గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. లే అవుట్‌లో అవసరమైన విద్యుత్, నీటి వసతి వంటి మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉన్నందున, లబ్దిదారులను చైతన్య పరచి ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడికొండూరు మండల తహశీల్దార్ కరుణ్ కుమార్, హౌసింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర రావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శ్రీనివాస్, డైరెక్టర్ ఏ.పి యంఆర్ఈడిసి కొత్త చిన్నప రెడ్డి, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పుల్లారెడ్డి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాక గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు కళ్లం పుల్లారెడ్డి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు కోరారు. శనివారం రాత్రి కళ్లం పుల్లారెడ్డి వర్ధంతి సభ పెనుమాక ఆ పార్టీ కార్యాలయం వద్ద జరిగింది. ముందుగా పుల్లారెడ్డి చిత్రపటానికి నాయకులు ఎం.భాగ్యరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో పార్టీ అభివృద్ధికి పుల్లారెడ్డి కృషి చేశారని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం కడ వరకు వెన్నంటి నిలిచారని చెప్పారు. గ్రామంలో అరాచక శక్తులను నిలువరించడానికి ముందు పీఠిన నిలబడ్డారని తెలిపారు. ప్రస్తుతం మతతత్వ బిజెపి ఫాసిస్టు విధానాలు అవలంభిస్తోన్న నేటికాలంలో పుల్లారెడ్డి లాంటి నేతలు లేకపోవడం బాధాకరమని చెప్పారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఘనమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌కె పీరూసాహెబ్, ఎస్‌కె ఖాదర్‌బాబా, నెమలికంటి వెంకటరావు, పి.గాంధీ, హనుమంతరావు, ఎస్‌కె మీరావలి తదితరులు పాల్గొన్నారు.



పుల్లారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నూరు శాతం ఇంటి పన్ను వసూలు



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతి సిబ్బంది

ప్రజాశక్తి- దుగ్గిరాల

మండల కేంద్రం దుగ్గిరాల గ్రామ పంచాయతీలో నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేసిందని ఇందుకు సహాయ సహకరించిన గ్రామ ప్రజలకు పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ బాణావతి ఖుషిబాయి ధన్యవాదాలు తెలియజేశారు. పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్మూలనకు మొదటి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీ సమస్య ఉన్నమాట వాస్తవమే కానీ నిధులు లేక కొంత వెనుక పడ్డామని తెలిపారు. గ్రామ సభలో డ్రైనేజీ పారిశుధ్యంతోపాటు జగనన్న కాలనీల నిర్మాణం వేగవంతం పై లబ్ధిదారులతో చర్చించారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. గ్రామంలో ఎక్కడైనా తాగునీటి సమస్య , విద్యుత్ ప్లేట్ల సమస్య ఉన్నట్లయితే వెంటనే తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. మురుగునీరు పరిష్కారానికి సత్వర చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వాలంటీర్లు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రేతలకు జరిమానా



తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని వ్యాపార కూడళ్ళపై మున్సిపల్ అదికారులు శనివారం దాడులు చేశారు. నిషేదత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రేతలను, వారి వద్ద నిల్వలను గుర్తించి అపరాద రుసుం విధించారు. ఈ సందర్భంగా శానిటరి ఆకురాతి రామచంద్రరావు మాట్లాడుతూ 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగం నిషేదమన్నారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు అమ్మకూడదన్నారు. ముఖ్యంగా కర్రీస్ పాయింట్లు, మాంసం విక్రయ దుకాణాలు, కూరగాయల వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆదేశాల మేరకు నిరంతరం దాడులు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్లు డి.శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, పి.సుధాకర్, ఎం.సుబ్బారావు, వై.లక్ష్మినారాయణ, నగరదీపికలు పాల్గొన్నారు.



నిరుపేదలకు ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్ :అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు అంజుమన్ కమిటీ ద్వారా ఆర్థిక సాయాన్ని కమిటీ సభ్యులు శనివారం అందజేశారు. పట్టణంలోని 27వ వార్డుకు చెందిన షేక్ కాలేషా కుమారుడికి కిడ్నీ సమస్య బాధపడుతుండంగా వారికి రూ. 10వేలు అందజేశారు. అలాగే 5వ వార్డుకు చెందిన షేక్ అఫ్రుహున్‌కు రూ. 5వేలు, 25 వార్డుకు షేక్ బాషా యాక్సిడెంటుకు గురికావడం వల్ల వారి 5వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. 18 వ వార్డు వివర్స్ కాలనీకి షేక్ నాగూర్ అనారోగ్యంగా మృతి చెందితే అతని అంత్రక్రియలకు అంజుమన్ కమిటీ అధ్యక్షులు, మైనార్టీ కమిషన్ నెంబర్ షేక్ సైపుల్ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మొల్ల నసురుద్దీన్, సెక్రటరీ షేక్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



బాలాత్రిపురసుందరి,వక్తలు సామ్రాజ్యం, విజయలక్ష్మిలను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కళాకారిణి బాల త్రిపురసుందరికి సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్: శక పురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం, ఆదివారం ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై, నటించిన సినిమాలపై, ఆయన రాజకీయ జీవితంపై జరిగే సదస్సును కొత్తపేట పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో శనివారం నిర్వహించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సన్మానించే కార్యక్రమంలో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారిణి, కూచిపూడి నృత్యగురువు డాక్టర్ చల్లా బాలాత్రిపురాసుందరిని ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించి ఎన్టీఆర్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వక్తలు కావేటి సామ్రాజ్యం, పరిమి విజయలక్ష్మిలు బహుజనులు పక్షాన నిలిచిన ఎన్టీఆర్ సినిమాలు అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం వక్తలనూ ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు, డి. భవాని, ఎన్టీఆర్ జగన్, ఎ. సామ్రాజ్యమ్మ, డి భాస్కర్, కె రమేష్, ఎ వెంకటేశ్వరరావు, బాషా మాస్టారు, గురునాథరావు, తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో గృహాలకు తాగునీటి సరఫరా

ప్రజాశక్తి- మంగళగిరి:మంగళగిరి టిడ్కో గృహ సముదాయంలోని బి-24 బ్లాక్ వద్ద పైపులైన్ పగిలిపోవడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వెంటనే స్పందించారు. శనివారం జలధార పేరుతో తాగునీటి ట్యాంకర్‌ను పంపించి తాగునీటిని సరఫరా చేయించారు. తాగునీటి పైప్‌లైన్ పునరుద్ధరణ జరిగే వరకు ట్యాంకర్‌ల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుందని మంగళగిరి పట్టణ పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు తెలియజేశారు. నియోజకవర్గంలో తాగునీటి కొరత రానివ్వకుండా నారా లోకేష్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయిస్తున్నట్లు తెలిపారు.

సాగునీళ్లివ్వమంటే అరెస్టులా..

- పల్నాడు జిల్లా నకరికల్లులో రైతులు, రైతు సంఘాల నాయకుల అరెస్టులకు నరసరావుపేట, రాజుపాలెం, పిడుగురాళ్ల, సత్తెనపల్లిలో ప్రజాసంఘాల నిరసన
- సత్తెనపల్లి నిరసనలో నీటి విడుదలకు మంత్రి హామీ - ఆందోళనకారులు విడుదల



సత్తెనపల్లిలో సిపిఎం, ప్రజాసంఘాల ధర్నాను చుట్టుముట్టిన పోలీసులు


సత్తెనపల్లిలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకుల నిరసన ప్రదర్శన

ఎండిపోతున్న పంటలకు సాగునీరివ్వమంటే రైతుల్ని,రైతు సంఘం నేతల్ని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఘటన శనివారం పల్నాడు జిల్లా నకరికల్లులో చోటు చేసుకుంది. ఆందోళనాకారులను అమానవీయంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పల్నాడు జిల్లాలో నరసరావుపేట, పిడుగురాళ్ల, రాజుపాలెం, సత్తెనపల్లిలో ప్రజాసంఘాన నాయకులు నిరసన తెలిపారు. సత్తెనపల్లి నిరసనలో మంత్రి హామీతో ఆందోళన విరమించారు.

ప్రజాశక్తి - రాజుపాలెం

అక్రమ అరెస్టులను ఖండించాలని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య డిమాండు చేశారు. శనివారం సాగర్ ఆయుకట్టకు నీరు విడుదల చేయాలని కోరుతూ నకరికల్లు అడ్డరోడ్డు వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి రాజుపాలెం పోలీస్ స్టేషన్ కు తీసుకు రావడం విద్రోహ చర్యని అని ఆయన అన్నారు. అరెస్టు అయిన రైతు సంఘ నాయకులు పరామర్శించటానికి వచ్చిన చలమయ్యను ముందుగ పోలీసులు అడ్డుకున్నారు. దినికి ఆయన తన నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో తో మాట్లాడుతూ సాగర్ ఆయుకట్టకు నీరు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. వరి. మొక్కజొన్న, మిర్చి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పంటలు ఎండి పోతున్న ఈ నియోజకవర్గనికి ప్రాతినిధ్యం వహిస్తున్న జలవనరులశాఖ మంత్రికి ఏమీ పట్టడంలేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా నీరు అందివ్వకపోతే అసమర్ధ మంత్రిగా మిగిలి పోతారని అన్నారు. వెంటనే నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సాగర్ ఆయుకట్టు ప్రాంతంలో పంటలు వేసిన రైతుల భూములకు ఏప్రిల్ ఆఖరి వరకు నీటి విడుదల చేయాలని, కోరుతూ రైతు సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నకరికల్లు అడ్డరోడ్డు వద్ద ధర్నా చేస్తున్న వారిని, అక్రమ అరెస్టులను ఖండిస్తూ సత్తెనపల్లి పట్టణంలోని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక సిపిఎం కార్యాలయం నుండి బయలుదేరిన కార్యకర్తలను సత్తెనపల్లి పట్టణ పోలీసులు మోహరించి అడ్డుకున్నారు. ఆందోళన చేయడానికి అనుమతులు లేవని ఆందోళన చేయడానికి వీలులేదని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆందోళన కారులు ఎండిపోతున్న పంటలకు సాగునీరు ఇవ్వాలని అడిగితే అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. నకరికల్లు లో అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేసే వరకు ఆందోళన చేస్తామని తేల్చి చెప్పారు. సిపిఎం కార్యాలయం నుండి బయలుదేరిన నిరసన ప్రదర్శన తాలూకా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. అంబేద్కర్ విగ్రహం వద్దబైటాయించ్చిన ఆందోళనకారులు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి కౌలు రైతు సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 15 రోజులుగా సాగర్ కుడికాలువకు సాగునీరు విడుదల కాక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. రైతులు సిపిఎం కార్యాలయాల వద్దకు వచ్చి ఆందోళన చెందుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత ఉత్కంఠంగా పోలీసు బలగాల మధ్య సాగిన ఈ ఆందోళన గంటకు పైగా సాగింది. రైతుల ఆందోళనలను తెలుసుకున్న రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆందోళనకారుల వద్దకు వచ్చి శనివారం రాత్రికి సాగునీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన కారులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం,ప్రజాసంఘాల నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి శివ నాగరాణి, నాయకులు ధరణికోట విమల, గద్దె ఉమాశ్రీ, గుంటుపల్లి రజిని, అనుముల వీరబ్రహ్మం, గుంటుపల్లి బాలకృష్ణ,ఎం హరిపోతురాజు, మామిడి జగన్నాథరావు, గింజుపల్లి మస్తాన్‌రావు, మక్కపాటి నరసింహారావు, రావూరి పూర్ణయ్య ,రొంపిచర్ల పురుషోత్తం, జడ రాజకుమార్, సిహెచ్ లక్ష్మీనారాయణ, పంతంగి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

నకరికల్లు అడ్డరోడ్డు వద్ద ధర్నా చేస్తున్న వారిని, అక్రమ అరెస్టులను ఖండిస్తూ పిడుగురాళ్ల పట్టణంలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు బుంగ నాగేశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు వేసిన మిర్చి, వరి, జొన్న, మొక్కజొన్న తదితర పంటలకు నీళ్లు అందక ఎండిపోతున్నాయని వాటికి వెంటనే నీటిని విడుదల చేయాలని కోరుతూ రైతులు ఆందోళన చేయడం న్యాయమైనదని వారిని అక్రమ అరెస్టు చేయడం హేయమైనా చర్యని వారు అన్నారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెబుతున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతు పంట చేతికి వచ్చేంత వరకు వీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అరెస్టు అయిన వారిని వెంటనే విడుదల చేయాలని లేని పక్షం ఆందోళన చేపడతామని వారు డిమాండ్ చేశారు. నిరసన తెలియజేసిన వారిలో రైతు సంఘం నాయకులు బుంగ నాగేశ్వరరావు, ఏపూరి వెంకటేశ్వర్లు , అచ్చం వెంకటేశ్వర్లు, సల్ల కోటేశ్వరరావు మజ్జిగ నరసింహారావు, చల్ల చిన్న కోటిరెడ్డి, షేక్ బాబు, సంపత్ వెంకటకృష్ణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


రాజుపాలెం పోలీస్ స్టేషన్ వద్ద చలమయ్య ఆందోళణ



నరసరావుపేటలో


పిడుగురాళ్లలో


ప్రజాశక్తి - నరసరావుపేట

ఎండిపోతున్న పంటలకు సాగు నీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని పలు మార్లు సిపిఎం డిమాండ్ చేసినప్పటికీ ఎన్.ఎస్.పి అధికారులు ప్రభుత్వ పెద్దలు పట్టించుకోక పోవడంతో సిపిఎం ప్రత్యక్ష పోరాటానికి దిగిందని ఈ నేపథ్యంలో సాగు నీటి విడుదలపై దృష్టి సారించాల్సిన అధికారులు అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు డి.శివ కుమారి, ఎస్ ఆంజనేయ నాయక్ లు అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గం నకరికల్లు మండలం నిరసనకు దిగిన సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాల్ రావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు కామినేని రామారావు, వై.రాధాకృష్ణలను నకరికల్లు పోలీసులు అరెస్ట్ చేసి రాజుపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని ఖండిస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి జిల్లాకు చెందిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు నాగమ్మ భాయ్, ఎస్.దుర్గా భాయ్, ఫాతిమా నాయకులు రబ్బానీ, హుస్సేన్,సుభాష్ చంద్రబోస్ సుభాని,మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

నీరు విడుదల చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు నియోజకవర్గంలో మిర్చి, మొక్కజొన్న పంటలు చివరి దశలో ఉన్నాయని, ఒక్క తడి పెట్టుకునేందుకు సాగునీరు విడుదల చేయాలని ఎన్ఎస్‌పి సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను శనివారం కోరినట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఒక తడి నీరు పెట్టడం వలన 5 నుంచి7 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు విజ్ఞప్తి చేశారని, వెంటనే స్పందించి ఎన్ఎస్పి ముఖ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఎమ్మెల్యే తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి రెండు రోజుల్లో నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. డ్యాంలలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున, వేసవికాలం అయినందున భూమి నీటిని ఎక్కువగా పీల్చే అవకాశం ఉన్నందున, రైతులు నీటిని వృధా చేయకుండా పొదుపుగా పంటచేలకు మాత్రమే వాడుకోవాలని సూచించారు. అలాగే వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా మంచినీటి చెరువులన్నింటిని కూడా నీటితో నింపాలని అధికారులను కోరారు.



మాట్లాడుతున్న డాక్టర్ జ్యోతిర్మయి

విజ్ఞాన్స్‌లో ఏఎఫ్ఎస్‌టీఐ గుంటూరు చాప్టర్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఏఎఫ్ఎస్‌టీఐ (అసోసియేషన్ ఆఫ్ ఫుడ్ సైంటిస్ట్స్ అండ్ టెక్నాలజిస్ట్స్ ఇండియా) గుంటూరు చాప్టర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'గ్రీన్ కోటింగ్' ఇన్వెస్టింగ్ ఇన్ ద ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్ సిస్టమ్' అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఎఫ్ఎస్‌టీఐ వైస్ ప్రెసిడెంట్, హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ ఆర్సీ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ టీ.జ్యోతిర్మయి, ఏఎఫ్ఎస్‌టీఐ మాజీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పీ.రామకృష్ణ, మహారాష్ట్రలోని విట్టల్‌గంగా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కో-లిమిటెడ్ ఫౌండర్, చైర్మన్ ధనరాజ్ షిండే, యూఎస్, యూరోప్ ఆర్‌పీజీ గ్రూప్ కోఫౌండర్ కపిల్ భర్తిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఏఎఫ్ఎస్‌టీఐ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రొఫెషనల్, ఎడ్యుకేషనల్ ఆర్గనైజేషన్ అని తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 46 చాప్టర్లు, 4500 మంది సభ్యులున్నారని, అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నేడు రెండో ఏఎఫ్ఎస్‌టీఐ చాప్టర్‌ను ప్రారంభించామన్నారు. మానవాళికి నాణ్యమైన ఆహారాన్ని అందించటమే ఏఎఫ్ఎస్‌టీఐ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వర్క్‌షాప్‌కు వర్సిటీ పరిసరాల్లోని రైతులూ హాజరయ్యారు.

ఫలించిన రైతుల కృషి

సాగర్ ఆయకట్టు పరిధిలో రబీ పంటలను కాపాడుకునేందుకు రైతులు చేసిన పోరాటం ఫలించింది. రబీపంటలకు నీటి సరఫరా నిలిపివేయడంపై గత వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో రైతులు ఆందోళనలు చేశారు. ప్రధానంగా రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలో వివిధ నిరసనలు, ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించారు. అధికారు లకు వినతిపత్రాలు అందచేశారు.

శనివారం నకరికల్లు వద్ద ఆందోళనకు పూనుకున్న రైతు, కౌలు రైతు సంఘం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అలాగే టిడిపి నాయకులు కూడా సత్తెనపల్లి నియోజకవర్గంలో ఆందోళనలు నిర్వహించారు. ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి కుడి కాలువ పరిధిలో 132 టిఎంసీలు నీరు వినియోగించుకోవాల్సి ఉండగా 200 టిఎంసీల నీరు వినియోగించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో కృష్ణా రిజర్వాయర్ యాజమాన్యబోర్డు నీటి విడుదల చేయాలని ఆదేశించింది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రైతుల ఆందోళనతో ప్రభుత్వం కృష్ణా రిజర్వాయర్ యాజమాన్య బోర్డుతో చర్చలు జరిపి ఆరు టిఎంసిలు వారం రోజుల పాటు విడుదలకు ప్రభుత్వం ఎట్టకేలకు శనివారం అంగీకరించింది. శనివారం రాత్రి సాగర్ కుడికాల్వకు నీటి విడుదల చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో అతివృష్టి, అనావృష్టి సమస్యలతో రైతులు అల్లాడుతున్నారు. అధిక వర్షాలతో గత ఖరీఫ్ ముగింపులో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధిక వర్షాలతో పాటు మాండూస్ తుపాను తాకిడికి రెండు జిల్లాల పరిధిలో వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న, శనగ తదితర పంటలకు నష్టం వాటిల్లింది. రబీ సీజన్‌లో అకాల వర్షాల వల్ల మిర్చి,జొన్న, మొక్కజొన్న పంటలకు కొంత నష్టం జరిగింది. ఖరీఫ్‌లో నష్టాలను చవిచూసిన రైతులు రబీ పంటలపై ఆశలు పెట్టుకున్నారు. రబీలో పంటలు ఇంకా కోతలు పూర్తికాకుండానే ఈనెల ఒకటో తేదీ నుంచి కుడికాలువకు నీటి సరఫరా నిలిపివేశారు. నీటి విడుదల కొనసాగిస్తే పంటలకు సాగు నీరు వినియోగించు కుంటారన్న కారణంగా అవసరానికి మించి నీటి వినియోగం జరిగిందనే నెపంతో సాగర్ కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు. నీటి

7 వీక్షణం

విడుదల నిలిపివేసే ముందు వివిధ శాఖల అధికారులతో కలసి జిల్లా కలెక్టర్లు కనీసం సమీక్షా సమావేశం కూడా నిర్వహించలేదు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డు సమావేశాలు ఏడాదికి ఒక్కసారి కూడా నిర్వహించడం లేదు. ప్రస్తుతం సాగర్ ఆయకట్టు పరిధిలో రబీ పంటలకు నీటి కొరత ఏర్పడింది. మిర్చి, మొక్కజొన్న, వరి పంటలకు నీటి సరఫరా లేక పైర్లు ఎండుతున్నాయి. 48 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ప్రస్తుతం కంకిదశలో ఉంది. సాగర్ ఆయకట్టుపరిధిలో 1.80 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు అయింది. మిర్చి చివరి కోతలకు సిద్ధం అవుతున్న తరుణంలో నీటి అవసరం ఉంది. పల్నాడు జిల్లాలో 35 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరగ్గా ప్రస్తుతం కంకిదశలో ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నీటి సరఫరాను నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయంపై వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి నీటి సరఫరా పునరుద్ధరణకు రైతులు చేసిన ఆందోళనలు విజయవంతం అయ్యాయి.

(ఎ.వి.డి.శర్మ)